సాక్షి
అనంతపురం

సోమవారం । 23 । అక్టోబర్ । 2023



నిందితుల కోసం వేట

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లపై దాడులు చేసిన నిందితులను పట్టుకునేందుకు రైల్వే శాఖ ముమ్మర వేట సాగిస్తోంది

IIలో



ఎంత చెప్పినా.. అడ్డదిడ్డమే!

నిబంధనలు పాటించకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చోదకులకు ఎంత చెప్పినా అడ్డదిడ్డంగా నడుపుతూనే ఉన్నారు.

IIలో

గరిష్టం/కనిష్టం
35.0°/ 22.0°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆగ్నేయం దిశగా గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు 'స్పందన' ఉండదు

అనంతపురం అర్బన్: విజయ దశమిని పురస్కరించుకుని సోమవారం ప్రభుత్వ సెలవు ఉన్నందున కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు ఆ రోజున కలెక్టరేట్‌లో జరగాల్సిన 'స్పందన'ను రద్దు చేసినట్లు డీఆర్ఓ గాయత్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి అర్జీలు ఇచ్చేందుకు వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని సూచించారు.

ప్రజలకు దసరా శుభాకాంక్షలు



కేవీ ఉషశ్రీచరణ్, రాష్ట్ర మంత్రి

కళ్యాణదుర్గం/ అనంతపురం అర్బన్: దుర్గామాత ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులతో జిల్లా సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని కలెక్టర్ గౌతమి అభిలషించారు. ప్రతి ఇల్లూ సిరిసంపదలతో తులతూగాలని అమ్మవారిని ప్రార్థించారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



విజేత ట్రోఫీని అందుకుంటున్న మహిళల జట్టు

అనంతపురం: పూర్వ వాలీబాల్ ఆటగాళ్లు ముస్తఫా అలీఖాన్, నగేష్ కుమార్ జ్ఞాపకార్థం నిర్వహించిన వాలీబాల్ టోర్నీ ఆదివారం నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ముగిసింది. నార్పల, పుట్టపర్తి, అనంతపురం హాస్పిటల్, అనంతపురం స్టేడియం పురుషుల జట్లు విజేతలుగా నిలిచాయి. అలాగే మహిళా విభాగంలో అనంతపురం స్టేడియం, లేపాక్షి, యోధ జట్లు విజేతలుగా నిలిచాయి. విజేతలను అభినందిస్తూ ట్రోఫీలను అనంతపురం వాలీబాల్ సంఘం అధ్యక్షుడు బషీర్, చైర్మన్ సాయిప్రసాద్, సెక్రెటరీ వెంకటేశ్ నాయక్, ట్రెజరర్ శేషాద్రి అందజేశారు. న్యాయనిర్ణేతలుగా రాజేంద్ర గౌడ్, అనిల్, నాగరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ సంఘం సభ్యులు దేవమ్మ, స్వర్ణ, కొండారెడ్డి, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, రమణ పాల్గొన్నారు.

డీఏ విడుదలపై హర్షం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం డీఏ విడుదల చేయడంపై ఏపీ వైఎస్సార్‌టీఎఫ్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట మేరకు దసరా కానుకగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డీఏ ప్రకటించారని వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి, ప్రధానకార్యదర్శి జి.శ్రీధర్‌గౌడ్ పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన నిలిచిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు.

రాచపాళెం సాహిత్య శైలి విభిన్నం



అవార్డు అందుకున్న రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

అనంతపురం కల్చరల్: 'విమర్శ' ప్రక్రియలో ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి శైలి విభిన్నమని గుర్రం జాషువా కళాపీఠం వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అభివర్ణించారు. ప్రతిష్టాత్మక వ్యక్తులకందించే విమల స్మారక సాహిత్య జీవిత సాఫల్య పురస్కారాన్ని ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి అందుకున్నారు. ఆదివారం విమలాశాంతి సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని సాయిబాబా కళాశాలలో జరిగిన కార్యక్రమానికి రాజారామ్ అధ్యక్షత వహించారు. మాణిక్య వరప్రసాద్‌తో పాటు ఎస్వీయూ తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ మేడిపల్లి రవికుమార్, డాక్టర్ శాంతినారాయణ, కళాశాల సెక్రటరీ డాక్టర్ నిర్మల, సీనియర్ కథా రచయిత ఉప్పరపాటి వెంకటేశులు తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు. తెలుగు సాహిత్య ప్రక్రియల్లో సునిశిత పరిశీలనతో విమర్శ చేసే దార్శనికుడిగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధులైన రాచపాళెంకు విమల స్మారక సాహిత్య పురస్కారమందించడం గర్వకారణమని కొనియాడారు. నానీల నాగేంద్ర సభాసమన్వయం చేయగా, తరిమెల అమరనాథరెడ్డి, జనప్రియ కవి ఏలూరు యంగన్న, శశికళ ఆప్తవాక్యాలను పలికారు. ఈ సందర్భంగా దాసరి ఆదినారాయణ ఆలపించిన గీతం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కవులు, రచయితలు నబీరసూల్, షరీఫ్, కృష్ణమూర్తి, డాక్టర్ రసూల్, అశ్వర్థరెడ్డి, సురేష్, రియాజుద్దీన్, ఆనంద్, విశ్రాంత ప్రిన్సిపాల్ రంగస్వామి, వన్నప్ప, గోసల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



యాడికిలో మహిషాసుర మర్దిని అలంకారంలో పెద్దమ్మ తల్లి





అనంతపురంలోని పాతూరులో పూజా సామగ్రి, పూలు, పండ్లు, కూరగాయల కొనుగోళ్ల సందడి, జనంతో కిక్కిరిసిన రోడ్డు

దసరా సంబరం

అనంతపురం కల్చరల్: జిల్లా అంతటా దసరా సందడి నెలకొంది. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగ జరుపుకొంటారు. శరన్నవరాత్రులను పురస్కరించుకుని జగన్మాత రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం ఒకేరోజు మహర్నవమి, విజయదశమి రెండు పండుగలూ జరుపుకోవాలని ఆగమశాస్త్ర పండితులు సూచించారు. సాయంత్రం శమీ దర్శనంతో దసరా ఉత్సవాలు వైభవంగా ముగియనున్నాయి. ఇప్పటికే అమ్మవారి ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.

కొనుగోలుదారులతో కిటకిట

దసరా పండుగ వేళ ఆదివారం ఉదయం నుంచే పట్టణ, మండల కేంద్రాలు, నగరంలో దుకాణాలు కిటకిటలాడాయి. పూజాసామగ్రి, దుస్తులు, కిరాణా తదితర సరుకుల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. పూల ధరలు కొండెక్కి కూర్చున్నా అదే ఉత్సాహంతో విపరీతంగా కొనుగోళ్లు సాగాయి. అరటి పట్టలు, పండ్లు, టెంకాయల అంగళ్లు కిక్కిరిసాయి. విజయ దశమి సందర్భంగా విశేష పూజలతో పాటు శమీ వృక్షాలున్న చోట్ల భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



అనంతపురంలో కనకదుర్గగా ముత్యాలమ్మ

నేడే నవమి - దశమి..



ఆగమశాస్త్ర పండితులు నిర్ణయించిన మేరకు పండుగలు జరుపుకోవడం ఉత్తమం. ఈసారి నవమి సోమవారం మధ్యాహ్నం వరకు ఉంటుంది, వెంటనే దశమి ఘడియలు వచ్చేయడం వల్ల అదేరోజు సాయంత్రం శమీపూజలు నిర్వహించాలి. దసరా నవరాత్రి ఉత్సవం అంటేనే అమ్మవారి అనుగ్రహంతో ఆశీర్వాదం అందుకోవడం. అందుకు అనుగుణంగా శమీపత్రితో పెద్దల ఆశీస్సులందుకుంటే సకల సౌభాగ్యాలు కల్గుతాయి అని శాస్త్రం చెపుతోంది. – మధుసూదనరావు, చంద్రశేఖరేంద్ర సరస్వతీ జ్ఞాన పీఠం

పోలీసు కార్యాలయంలో ఘనంగా ఆయుధపూజ

అనంతపురం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఆయుధపూజను ఘనంగా నిర్వహించారు. పోలీసులు వినియోగించే తుపాకులు, వాహనాలు, ఇతర సామగ్రికి ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ చేతుల మీదుగా పూజ చేశారు. ముందుగా ఎస్పీ ఆయుధాగారంలో దుర్గామాత చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దుర్గామాత ఆశీస్సులతో జిల్లా ప్రజలు, సంతోషంగా, ప్రశాంతంగా జీవనం సాగించేలా చూడాలని ఆకాంక్షించామన్నారు. పోలీసులకు దైనందిన విధులు, సేవల్లో విజయాలు చేకూరాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయ భాస్కరరెడ్డి, సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ, హనుమంతు, డీఎస్పీలు ప్రసాద్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజ్, ఎస్బీ సీఐలు జాకీర్, ఇందిర, డీసీఆర్‌బీ సీఐ విశ్వనాథచౌదరి, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ అన్బురాజన్

చెంతకే 'ఆధార్' సేవలు



అనంతపురంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మొబైల్ క్యాంప్‌లో ఆధార్ అప్‌డేషన్

జిల్లాలో ఇప్పటి వరకు ఆధార్ సేవలు ఇలా..	
మొత్తం సచివాలయాలు	663
ప్రభుత్వం ఇచ్చిన ఆధార్ కిట్‌లు	133
ఒక కేంద్రం పరిధిలో సచివాలయాల సంఖ్య	5
ఆధార్ సేవలందిస్తున్న సచివాలయాలు	126
కొత్తగా ఆధార్ ఎన్‌రోల్మెంట్	17,702
తప్పనిసరి అప్‌డేట్ (వయసు 5-7 ఏళ్ల మధ్య), వయసు (15-17 ఏళ్ల మధ్య)	68,197
తప్పనిసరి అప్‌డేట్ (వయసు 7-15 ఏళ్ల మధ్య)	4,336
బయోమెట్రిక్ అప్‌డేట్	29,083
డెమోగ్రాఫిక్ అప్‌డేట్	54,457
డాక్యుమెంట్ అప్‌డేట్	38,223
జగనన్న సురక్షలో ఆధార్‌కు మొబైల్ లింక్	17,259
మొత్తం సేవలు	2,29,390

- పడిగాపులకు చెక్
- సచివాలయాల్లో ఆధార్ సేవలు
- ప్రతి నెలా 3 లేదా 4వ వారం మొబైల్ క్యాంపు

అనంతపురం అర్బన్:

- ఆధార్ నవీకరణ (అప్‌డేట్) చేసుకోవాలన్నా... కొత్తగా ఆధార్ పొందాలన్నా... పెద్ద ప్రయాసతో కూడిన వ్యవహారంగా ఉండేది. ఆధార్ అప్‌డేషన్ కోసం ప్రజలకు పడిగాపులు తప్పేవి కావు. తెల్లవారుజాము నుంచే బ్యాంకుల వద్ద బారులుదీరిన క్యూ లైన్లు కనిపించేవి. ఈ క్రమంలో గొడవలు, తోపులాటలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించేవారు. ఇదంతా గతం...

నేడు: అలాంటి పరిస్థితులు కనిపించవు. జగన్ సర్కార్ తీసుకున్న చర్యలు ఇందుకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ఆధార్ అప్‌డేట్ కోసం బ్యాంకులు, పోస్టాఫీసుల వద్ద ప్రజలు పడిగాపులుకాచే పరిస్థితికి చెక్ పెట్టింది. కొత్తగా ఆధార్ ఎన్‌రోల్మెంట్, ఆధార్ అప్‌డేట్‌ను సులభతరం చేసింది. సచివాలయాల్లోనే ఆధార్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇదే క్రమంలో మొబైల్ క్యాంపు నిర్వహిస్తూ ఆధార్ సేవలను మరింత చేరువ చేసింది.

126 సచివాలయాల్లో సేవలు..

ఆధార్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల్లో ఆధార్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లా వ్యాప్తంగా 663 సచివాలయాలకు సంబంధించి 133 ఆధార్ కిట్‌లను ప్రభుత్వం ఇచ్చింది. 5:1 నిష్పత్తిలో ఐదు సచివాలయాలకు ఒక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ లెక్కన 126 సచివాలయాల్లో ఆధార్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. సచివాలయాల ద్వారా ఇప్పటి వరకు 2,29,390 మంది ఆధార్ సేవలు పొందారు.

మొబైల్ క్యాంపులు..

ప్రతి నెలా మూడవ లేదా నాల్గవ వారం మొబైల్ క్యాంపులు నిర్వహించి ఆధార్ సేవలను ప్రజల చెంతకే తీసుకెళుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 19న గుంతకల్లు మునిసిపాలిటీలో క్యాంపు నిర్వహించి 72 మందికి ఆధార్ సేవలు అందించారు. ఈ నెల 20, 21 తేదీల్లో అనంతపురంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో 152 మందికి ఆధార్ సేవలు అందించారు.

చాలా సంతోషంగా ఉంది



ఆధార్‌లో వేలిముద్రలను సరిచేసుకోమని అధికారులు చెప్పారు. రాజేంద్ర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన క్యాంపునకు వచ్చి ఇరవై నిమిషాల్లోనే ఆధార్ అప్‌డేట్ చేయించుకున్నా. చాలా సంతోషంగా ఉంది. డబ్బులు తీసుకోకుండా ఉచితంగానే ఆధార్ సరిచేశారు.
– రామసుబ్బమ్మ, హౌసింగ్ బోర్డ్, అనంతపురం

సేవలు అభినందనీయం



ఆధార్ అప్‌డేషన్ కోసం గతంలో చాలా ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. సచివాలయాలు, ప్రత్యేక క్యాంపుల ద్వారా ఆధార్ సేవలను ప్రజలకు సత్వరం అందేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు అభినందనీయం.
– జస్మిత, శ్రీనివాసనగర్, అనంతపురం

ప్రజలకు చేరువగా ఆధార్ సేవలు



ఆధార్ సేవలను ప్రభుత్వం ప్రజలకు చేరువ చేసింది. ఐదు సచివాలయాలకు ఒక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ఈ ప్రకారం జిల్లాలో 126 సచివాలయాల ద్వారా ఆధార్ సేవలు ప్రజలకు అందుతున్నాయి. ప్రతి నెలా 3 లేదా 4వ వారం మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. ఆధార్ సేవలపై మానిటరింగ్ కోసం డీఎల్‌డీఓను నియమించాం.
– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేసింది. ఈ మేరకు జీఓ 2072ను ఆదివారం జారీ చేసింది. విజయవాడ టూరిజం ఆర్జేడీగా ఉన్న వక్కా శ్రీనివాసులరెడ్డిని గుంతకల్లు ఆర్డీఓగా నియమించారు. ఇదివరకు ఆర్డీఓగా నియమితురాలైన అనురాధ పోస్టింగ్‌ను రద్దు చేస్తూ.. ఆమెను కర్నూలు హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ఎస్‌డీసీగా నియమించారు. కేఎస్ సాగర్ (పులిచింతల) ప్రత్యేక కలెక్టర్‌కు పీఏగా ఉన్న సి.వసంతకుమార్ హెచ్చెల్సీ ఎస్‌డీసీగా నియమితులయ్యారు. ఆత్మకూరు ఆర్డీఓ ఎస్.కరుణకుమారిని అనంతపురం ఆన్‌సెట్ సీఈఓగా నియమించారు. ఇక్కడ ఆన్‌సెట్ సీఈఓగా ఉన్న జి.కేశవనాయుడును పార్వతీపురం కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీగా బదిలీ చేశారు. కర్నూలు హెచ్ఎన్ఎస్ఎస్-2 ఎస్‌డీసీగా ఉన్న కె.మల్లికార్జునను అనంతపురం హెచ్ఎన్ఎస్ఎస్ (ఎల్ఏ) ఎస్‌డీసీగా బదిలీ చేశారు. ఇక్కడ హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్‌డీసీగా ఉన్న సుధారాణిని కర్నూలు నేషనల్ హైవే ఎస్‌డీసీగా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న జె.వరప్రసాద్ ఎస్ఎస్ఏ అదనపు కో–ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. అనంతపురం పర్యాటక శాఖ ఆర్‌జేడీగా సి.వెంకటనారాయణమ్మను నియమించారు.

- కదిరి ఆర్డీఓగా ఎం.సన్ని వంశీకృష్ణను నియమిస్తూ ఈ నెల 19న ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ ఉన్న ఎస్.రాఘవేంద్రరావును జీఏడీలో రిపోర్ట్ చేసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాజాగా ఆయనను మదనపల్లి హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఎస్‌డీసీగా నియమించారు.

హోం మంత్రికి ఘన స్వాగతం



హోంమంత్రిని కలిసిన ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, మేయర్ వసీం, మాజీ ఎమ్మెల్యే విశ్వ తదితరులు

అనంతపురం క్రైం/ కార్పొరేషన్/సిటీ: అనంతపురం పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ)లో 28 మంది డీఎస్పీలు ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. సోమవారం ఉదయం పీటీసీ మైదానంలో పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులు రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఇతర అధికారులు ఆదివారం సాయంత్రమే అనంతపురం చేరుకున్నారు. ఓ ప్రముఖ హోటల్ వద్ద ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌తో సహా పలువురు అధికారులు హోంమంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సైపుల్లా బేగ్, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి తదితరులు హోంమంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలందించి స్వాగతం పలికారు. డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి పోలీసు అతిథి గృహానికి చేరుకున్నారు. ఎస్పీతో సహా పలువురు అధికారులు డీజీపీకి స్వాగతం పలికారు.



హోంమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గిరిజమ్మ

● ప్రశాంతి నిలయంలో ఘనంగా దుర్గాష్టమి



స్వర్ణ రథానికి పూజలు చేస్తున్న రత్నాకర్ రాజు, చక్రవర్తి

ప్రశాంతి నిలయం: శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో ఆదివారం దుర్గాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో మహాసమాధి చెంత వేదపఠనంతో కార్యక్రమాలు ప్రారంభించారు. సత్యసాయి ఉపయోగించిన కార్లు, సత్యసాయి బంగారు రథానికి ఆయుధపూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి నామం మార్మోగింది. రేడియోసాయి కార్యాలయం, పలు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కార్యాలయాల్లో ఆయుధపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమాల్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

MEDICAL POST GRADUATION
MD RADIOTHERAPY
SEAT AVAILABLE
CONTACT:
75694 33171
VISWA BHARATHI MEDICAL COLLEGE KURNOOL

క్లుప్తంగా

చెరుకు తోట దగ్ధం



మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న రైతులు

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లులో ప్రమాదశాత్తు ఓ చెరుకు తోట అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన రైతు కురుబ గాదిలింగ తనకున్న 15 ఎకరాల్లో చెరుకు సాగు చేపట్టాడు. ఆదివారం సాయంత్రం చెరుకు తోట పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని మంటలు ఎగిసిపడ్డాయి. గమనించిన రైతులు మంటలు ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసే లోపు దాదాపు ఏడు ఎకరాల్లో తోట కాలి బూడిదైంది. ఘటనతో రూ.7 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు శ్రీనివాసులు

ముదిగుబ్బ/తలుపుల: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.... తలుపుల మండలం వీరప్పగారిపల్లికి చెందిన శ్రీనివాసులు(27) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా జబ్బు నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం అనంతపురంలో వైద్య చికిత్స చేయించుకుని భార్య మానసతో కలసి ఆమె పుట్టినిల్లైన నల్లమాడ మండలం వంకరకుంటకు బయలుదేరాడు. మార్గమధ్యలో మలకవేమల రైల్వే లెవల్ క్రాస్ వద్ద గేటు వేయడంతో ద్విచక్ర వాహనాన్ని ఆపి నీళ్లు తాగి వస్తానంటూ పట్టాలు దాటి అటువైపుగా వెళ్లాడు. కాసేపటి తర్వాత అటుగా వచ్చిన రైలు కిందకు దూరి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించడంతో బోగి తగిలి ఎగిరి పడి మృతిచెందాడు. మృతుడికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి... కదిరి ఏరియా ఆస్పత్రికి చేరుకుని శ్రీనివాసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతికి కారణాలు ఆరా తీసి, బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. తక్షణ ఆర్థిక సాయంగా రూ.20 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట జిల్లా సంయుక్త కార్యదర్శి కుర్లి శివారెడ్డి, వెంకటరమణారెడ్డి ఉన్నారు.

బిడ్డకు ప్రాణభిక్ష పెట్టారు

- క్యాన్సర్ బాధిత చిన్నారి తల్లి భావోద్వేగం
- గొప్ప మనసుతో సీఎం జగన్ రూ.14 లక్షలు అందజేశారు
- మా బాధను విప్ కాపు అర్థం చేసుకుని స్పందించారు



లెటర్ ఆఫ్ క్రెడిట్ పత్రాన్ని బాధిత కుటుంబానికి అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న భర్త పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి వరకూ గడప దాటి ఎరుగని ఇల్లాలిపై ఇద్దరు చిన్న పిల్లల పోషణ భారం పడింది. దిక్కుతోచని పరిస్థితి. అయినా బిడ్డల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని బతుకు పోరాటాన్ని సాగిస్తూ వచ్చింది. అయినా విధి ఆమె పట్ల వక్రీకరించింది. ఏడేళ్ల వయసున్న చిన్న కుమారుడు క్యాన్సర్ వ్యాధి బారిన పడ్డాడు. తన వద్ద ఉన్న ఆస్తి మొత్తం అమ్మినా.. చికిత్సకు అవసరమైన డబ్బు సమకూరదు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి స్పందించారు. చిన్నారి అంశాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.14 లక్షల ఆర్థిక సాయం అందేలా చొరవ తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని ఆదివారం బాధిత కుటుంబానికి విప్ అందజేసినప్పుడు నిస్సహాయురాలైన ఆ తల్లి భావోద్వేగానికి లోనైంది. ఆ వేదన ఆమె మాటల్లోనే...

చిన్న వయసులోనే పిల్లల తండ్రి పోయాడు..

నా పేరు వడ్డే లక్ష్మి. రాయదుర్గంలోని పదో వార్డులో నివాసముంటున్న వడ్డే లోకేష్‌తో నాకు వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. పెద్దోడు చిన్మయ్ 8వ తరగతి, చిన్నోడు లక్షిత్ 3వ తరగతి చదువుకుంటున్నారు. వీరిద్దరూ చిరుప్రాయంలో ఉన్నప్పుడే నా భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ పరిస్థితుల్లో నాకు దిక్కు తోచలేదు. ఇద్దరు చిన్న పిల్లలను పట్టుకుని ఎలా బతకాలో అర్థం కాలేదు. అయినా పిల్లలిద్దరినీ ప్రయోజకులను చేయాలనే ఆశ నన్ను బతుకు పోరాటం సాగించేలా చేసింది.

రూ.20 లక్షలు అవుతుందన్నారు..

మా చిన్నోడు లక్షిత్ ఒక రోజు స్కూల్ నుంచి వస్తూ సొమ్మసిల్లి పోయాడు. ఏమైందోనని చాలా భయపడ్డాను. ఆస్పత్రికి తీసుకెళ్లా. పరీక్షించిన వైద్యులు అదేదో క్యాన్సర్ జబ్బు సోకిందన్నారు. నాకేమీ అర్థం కాలేదు. హైదరాబాద్‌లోని అమెరికన్ సిటిజన్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. అతి కష్టంపై పిల్లాడిని తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లా. ఆస్పత్రిలో పరీక్షించిన డాక్టర్లు పిల్లాడికి బోన్‌మ్యారో చికిత్స చేయాలని, ఇందు కోసం రూ.20 లక్షలు ఖర్చు అవుతుందంటూ ఓ లెటర్ చేతికి ఇచ్చారు. ఆలస్యం చేస్తే పిల్లాడి ప్రాణాలకు ముప్పు తప్పదన్నారు. ఆ సమయంలో అంత డబ్బు ఎలా తీసుకురావాలో అర్థం కాక నాలో నేను ఎంతగా ఏడ్చానో ఆ దేవుడికే తెలుసు.

దేవుడిలా మా బాధను అర్థం చేసుకున్నారు..

హైదరాబాద్ నుంచి తిరిగొచ్చిన నేను నెల రోజుల క్రితం మా ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి సార్‌ను కలిసేందుకు ఆయన ఇంటి వద్దకెళ్లా. అప్పటికే ఇంటి వద్ద చాలా మంది ఉన్నారు. కాసేపటి తర్వాత సార్ నన్ను చూసి ఆగారు. వెంటనే నేనెళ్లి బిడ్డ పరిస్థితి తెలిపి ప్రాణభిక్ష పెట్టాలని వేడుకున్నా. గొప్ప మనసుతో ఆయన మా బాధను అర్థం చేసుకున్నారు. విషయాన్ని సీఎం జగనన్న దృష్టికి తీసుకెళ్లారు. దేవుడిలా మమ్మల్ని ఆదుకున్నారు. వైద్యం కోసం రూ.14 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత ఆస్పత్రికి ఉత్తర్వులు పంపారని, నేరుగా అక్కడికెళ్లి పిల్లాడికి చికిత్స చేయించుకుని రమ్మని మా ఎమ్మెల్యే సార్ ధైర్యం చెప్పారు (ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ). లెటర్ కూడా నా చేతికి ఇచ్చారు. మాకు నిజమైన దసరా ఈ రోజే వచ్చింది. నా కుమారుడికి ప్రాణభిక్ష పెట్టిన సీఎం జగనన్న, విప్ కాపు రామచంద్రారెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

చిన్మయ్‌కు అభినందన..

సీఎం కార్యాలయం నుంచి అందిన లెటర్ ఆఫ్ క్రెడిట్ పత్రాన్ని ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబానికి విప్ కాపు రామచంద్రారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే గొప్ప మనసున్న సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. సమస్యను వివరించగానే రూ.14 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరు చేయించారన్నారు. అంతే కాక బాధితుడికి అవసరమైన బోన్‌మ్యారో ఇవ్వడానికి ముందుకు వచ్చిన సోదరుడు చిన్మయ్‌ని అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏటూరి మహేష్ పాల్గొన్నారు.

కాలువలో వ్యక్తి మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బొమ్మనహాళ్: మండలంలోని హెచ్చెల్సీ 1వ డిస్ట్రిబ్యూటరీ బ్రాంచ్ కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శివ, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. దేవగిరి క్రాస్ సమీపంలో కాలువలో నీటిపై తేలియాడుతున్న పురుషుడి మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. 40 ఏళ్ల వయస్సు ఉంటుందని అంచనా వేశారు. తెలుపు రంగు చొక్కా, డ్రాయర్ మాత్రమే ఉన్నాయి. హెచ్చెల్సీ ప్రధాన కాలువ నుంచి బ్రాంచ్ కాలువలోకి మృతదేహం కొట్టుకు వచ్చినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి, ఖననం చేయించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే బొమ్మనహాల్ పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ శివ కోరారు.

డ్రిప్ పరికరాలకు నిప్పు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామానికి చెందిన రైతు పూలకుంట నరసింహప్ప పొలంలో డ్రిప్ పరికరాలకు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం మధ్యాహ్నం నిప్పు పెట్టారు. దీంతో రూ.1.50 లక్షల విలువైన డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

నిందితుల కోసం ముమ్మర వేట

- వందేభారత్ రైలుపై రాళ్ల దాడికి పాల్పడిన దుండగులను పట్టుకునేందుకు రంగంలోకి బృందాలు
- రైలు వచ్చే సమయానికి ట్రాక్ వెంబడి విస్తృత తనిఖీలు



అనంతపురం రైల్వే స్టేషన్‌లో ఆగిన వందేభారత్ రైలు

అనంతపురం సిటీ: కాచిగూడ-బెంగళూరు మధ్య తిరిగే వందేభారత్ రైలుపై రాళ్ల దాడికి పాల్పడిన దుండగుల కోసం జాయింట్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టారు. ఈ నెల ఒకటిన ధర్మవరం సమీపంలో, 17న అనంతపురం శివారులో వందేభారత్ రైలుపై రాళ్ల దాడి చోటు చేసుకున్న విషయం తెలిసిందే. 17 రోజుల వ్యవధిలో ఏకంగా రెండు పర్యాయాలు రాళ్ల దాడి జరగడంతో రైల్వే భద్రతా విభాగం అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ క్రమంలో వందేభారత్ రైలు జిల్లాలోకి ప్రవేశించి సరిహద్దు దాటే వరూ ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది ట్రాక్ వెంబడి ముందస్తుగానే అనుసరిస్తున్నారు. ఎక్కడైనా అనుమానితులు, ఆకతాయిలు, తాగుబోతులు కనిపిస్తే వారిని అదుపులోకి తీసుకుని వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నారు. మరో వైపు వందేభారత్‌పై ఇది వరకే రాళ్ల దాడికి పాల్పడిన దుండగులు ఎవరైందీ కనుక్కునే పనిలో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ అధికారులు తలమునకలయ్యారు. రైలుకు అమర్చిన సీసీ కెమెరాల ఫుటేజీల కోసం ఉన్నతాధికారులకు నివేదించారు. ఫుటేజీలు అందిన తర్వాత దుండగులు ఎవరైంది తేలే అవకాశముంది.

ఎంత చెప్పినా.. అడ్డదిడ్డమే!



సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ద్విచక్ర వాహనాన్ని ట్రాఫిక్‌కు అడ్డంగా నడుపుతున్న యువకుడు

గడిచిన 8 మాసాల్లో వివిధ సెక్షన్ల కింద నమోదైన కేసులు	
కేటగిరీ	కేసుల సంఖ్య
అధిక స్పీడు	387
మద్యం సేవించిన నడపడం	3,314
మొబైల్ మాట్లాడుతూ నడపడం	1,104
లైసెన్సు లేకుండా నడపడం	4,517
హెల్మెట్ లేకుండా నడపడం	59,875
సీటు బెల్టులేకుండా డ్రైవింగ్	6,571
అధిక లోడుతో గూడ్స్ రవాణా	4,770
అధిక లోడుతో ప్యాసింజర్ రవాణా	506
రాంగ్ పార్కింగ్‌లో వాహనాలు	27,187
ఇతరత్రా కేసులు	22,849

అవగాహన రాహిత్యం.. నిర్లక్ష్యం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మనం చేసే డ్రైవింగ్ సరిగా లేకపోతే మనతోపాటు ఎదుటి వారి ప్రాణాలకూ ముప్పు తెస్తోంది. ఓ వైపు రవాణా శాఖ అధికారులు, మరోవైపు పోలీసు అధికారులు ఎంత చెప్పినా వాహన చోదకులు అడ్డదిడ్డంగా వెళ్తుండటం పరిపాటిగా మారింది. ర్యాష్ డ్రైవింగ్ చేసే వారి వల్ల పద్ధతిగా వాహనాలు నడిపే వారికి తీవ్ర అసౌకర్యం కలుగుతోంది.

- వాహన చోదకుల్లో తీవ్ర నిర్లక్ష్యం
- ఎనిమిది నెలల్లో 1.85 లక్షల కేసుల నమోదు
- వేలాదిమందిపై డ్రంకన్ డ్రైవ్, హెల్మెట్ లేని కేసులు
- మితిమీరిన వేగంతో కొనితెచ్చుకుంటున్న ప్రమాదాలు
- మొబైల్ మాట్లాడుతూ బండ్లు నడుపుతున్న వారెందరో..

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో రోడ్డు భద్రతా నిబంధనలను చాలామంది ఉల్లంఘిస్తున్నారు. జరిమానాలు విధిస్తున్నా వారి డ్రైవింగ్ తీరులో ఎటువంటి మార్పూ కనిపించడం లేదు. ఎంతోమంది యువకులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ప్రమాదానికి గురై ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు జరిగాయి. ఇలాంటి వాటిపై భారీగా జరిమానాలు వేసినా, అవగాహనా కార్యక్రమాలు చేపట్టినా ఇప్పటికీ అనేకమంది అడ్డదిడ్డంగానే రోడ్లపై వెళ్తున్నారు. రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా తర్వాత ఎక్కువమందికి రోడ్డు నిబంధనల ఉల్లంఘన జరిమానాలు విధించింది అనంతపురం జిల్లాలోనే.

హెల్మెట్ లేని కేసులు వేలల్లో...

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని ఎంత చెప్పినా కొందరు ద్విచక్రవాహనదారులు పట్టించుకోవడం లేదని తేలింది. గడిచిన ఎనిమిది మాసాల్లో 60 వేల మందికి హెల్మెట్ లేకుండా వెళ్లినందుకు ఫైన్ వేశారు. అయినా ఈ ఏడాది ఆగస్టు వరకు 1.85 లక్షల మందిపై కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి కేసుల సంఖ్య ఏటికేటికీ తగ్గాలి గానీ, పెరుగుతుండటం చూస్తుంటే వాహనదారుల్లో నిర్లక్ష్యం ఎంత ఉందో అంచనా వేయొచ్చు. పోలీసుల ఆధ్వర్యంలో 1.85 లక్షల కేసులు నమోదు చేయగా, రవాణా శాఖ అధికారులు 4వేలకు పైగా కేసులు నమోదు చేశారు.

మొబైల్‌లో మాట్లాడుతూ నడపడం ప్యాషనైంది..

ముఖ్యంగా యువతీ యువకులు మొబైల్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్యాషన్‌గా మారింది. అత్యంత ప్రమాదకరమని తెలిసినా మాట్లాడుతూనే నడుపుతున్నారు. విశేషమేమంటే జాతీయ రహదారి లాంటి చోట్ల కూడా మొబైల్ మాట్లాడుతూనే టూవీలర్ నడుపుతున్నారు. దీనికితోడు మద్యం సేవించి నడపడం, హెల్మెట్ లేకుండా నడుపుతుండటంతో 90 శాతం ప్రమాదాలు, మృతులు ద్విచక్రవాహన దారులే నమోదవుతుండటం గమనార్హం. మృతి చెందుతున్న వారిలో ఎక్కువగా 30 ఏళ్ల లోపువారే ఉండటం ఆందోళన కలిగిస్తున్న అంశం.

భారీగా జరిమానాలు వేస్తున్నా...



అధిక స్పీడు వెళుతున్న వారికి స్పీడ్ గన్‌ల ద్వారా గుర్తించి భారీగా జరిమానా విధిస్తున్నాం. వారికి అవగాహనా క్లాసులు ఇస్తున్నాం. ప్రమాదానికి గురికాకుండా, ప్రాణాలు కాపాడటంలో భాగంగా అన్ని రకాలుగా చెబుతూనే ఉన్నాం. యువకుల్లో ముందుగా మార్పు రావాలి.

– వీర్రాజు, ఉప రవాణా కమిషనర్

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

షాప్స్ అమ్మబడును

■ ATP, KLD రోడ్‌లో ఉన్న పాండ ఫ్యామిలీ రెస్టారెంట్ మరియు వందన శారీస్ & కిడ్స్‌వేర్ షాప్ అమ్మబడును. సెల్ : 9030309695, 9866012861. [A-776924]

TOLET

■ ATP, రామ్‌నగర్, 80 ఫీట్ రోడ్డులో అన్ని ఆధునిక వసతులు గల 1300 చ.అ. 2 BHK ఫ్లాట్ బాడుగకు కలదు. సెల్ : 9440060878, 9948660609. [A-776922]

HOUSE FOR SALE

■ అనంతపురము, బళ్ళారి రోడ్డు నందు స్పంద వెంచర్ ప్రక్కన వున్న S.V.R.S. వెంచర్, బ్రాహ్మణపల్లి నందు ఉడ్‌వర్క్‌తో కూడిన 2BHK ఇల్లు అమ్మకానికి కలదు. సంప్రదించవలసిన నెం : 9000485162 (నో బ్రోకర్స్). [A-1265]

SERVICES

■ వ్యక్తిగత వ్యవసాయ భూములకు పర్సనల్ రైతులకు, ఉద్యోగస్తులకు, వ్యాపారస్తులకు మొదలగు వారికి ఆర్థిక సలహాలు మరియు సహాయం చేయబడును. సంప్ర: 9034053557 [T-181]

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V- 5947]

BUSINESS OFFER

■ ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 7015828102 [HA-788339]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన యువతులు కావలెను. సంప్ర : ఫోన్ : 9703927945. [A-776923]

■ SR Defence Academy కి అనంతపురం నందు పనిచేయుటకు PRO's, PET's and JL's కావలెను. Qul: Any Degree, Sal: 10K-30K, 9000852892, 78933 18282. [T-1177901]

■ ప్రముఖ కంపెనీ యొక్క రికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. ఫోన్: 7730899503 [G-1175]

■ ATP ప్రముఖ పెట్రోల్ బంక్ నందు పనిచేయుటకు అకౌంటెంట్, అర్హత : డిగ్రీ కలిగి వుండి లేదా కంప్యూటర్ నందు Tally అనుభవం కలవారు సంప్ర : 9441984127. [A-1266]

■ ప్రముఖ కంపెనీలో జిల్లా/మండలాల వారిగా పనిచేయుటకు కో ఆర్డినేటర్లు కావలెను. Sal: 20,000 ఆపైన, Send Resume వాట్సాప్. ✆ 7330552222. [T-1177903]

■ రామకృష్ణ గ్రూపు (AP NO-1) VJA, HYD. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, ఇంటి/ వంట పని, బేబికేర్ కొరకు వర్కర్స్ కావలెను, భోజనం+వసతి+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52828, 92814 52833 [B-1068147]

■ Require One Asst. Chemist for Lab at Kurnool. QUALIFICATION: B.Sc. Chemistry (Pass or Fail). Mail Id:raghunathdyechempvtltd@gmail.com. Contact Number: 94402 43049 [L-798864]

■ ప్రముఖ ఫుడ్ & బేవరేజెస్ కంపెనీ, అనంతపురము జిల్లాలో మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. మంచి జీతం + ఇన్సెంటీవ్స్, TA, DA లు కలవు, Q : MBA + ఏదైనా కూల్ డ్రింక్స్ మార్కెటింగ్‌లో కనీసం 3 సం॥ అనుభవం గలవారు బయోడేటాని వాట్సాప్ ద్వారా పంపగలరు. 9499499419. [A-776917]

■ నోబుల్ హెల్త్‌కేర్ సర్వీసెస్ అనంతపురము నందు వృద్ధులు, బెడ్ రీడన్ పేషెంట్స్ పక్షవాతం పేషెంట్స్, బేబీ కేర్, కేర్ టేకర్స్ 24 గంటలు పనిచేయుటకు ఓర్పుగల ఆయాలు, నర్సులు ఆడ మరియు మగ కావలెను. వారికి ఆకర్షణీయమైన జీతం మరియు ఉచిత భోజనము వసతి సదుపాయం కలదు. వివరాలకు సంప్రదించవలసిన నెంబర్లు 9441018078, 6301341831. [A-7341]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆకట్టుకున్న డీఎస్పీల ప్రీ పరేడ్



రిహార్సల్ చేస్తున్న డీఎస్పీలు

అనంతపురం క్రైం: శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలు పాసింగ్ అవుట్ పరేడ్‌పై ఆదివారం చేపట్టిన రిహార్సల్ ఆకట్టుకుంది. అనంతపురం పోలీసు శిక్షణా కళాశాలలో 28 మంది డీఎస్పీల శిక్షణ పూర్తయింది. సోమవారం వీరు కళాశాలను వీడనున్నారు. ఈ నేపథ్యంలో పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహణకు సన్నాహకాలు పూర్తయ్యాయి. కార్యక్రమానికి రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, డీజీపీ కేవీ రాజేంద్రనాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. దీంతో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పరేడ్‌ను పకడ్బందీగా నిర్వహించేలా నూతన డీఎస్పీలు అన్ని చర్యలూ తీసుకున్నారు. ఈ ప్రక్రియను శిక్షణ పీటీసీ ప్రిన్సిపాల్ వెంకట్రామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గీతాదేవి, అదనపు ఎస్పీ మల్లికార్జునవర్మ, డీఎస్పీ అల్లాబకాష్, సీఐలు, ఆర్ఐలు పర్యవేక్షించారు.

బ్యాంక్ ఖాతా నుంచి నగదు మాయం

గోరంట్ల: స్థానిక మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్ మహమ్మద్‌కు చెందిన బ్యాంక్ ఖాతా నుంచి పెద్ద మొత్తంలో నగదు మాయమైంది. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గోరంట్లలోని ఎస్‌బీఐ శాఖలో నూర్ మహమ్మద్‌కు ఖాతా ఉంది. ఈ ఖాతా నుంచి నాలుగు విడతలుగా రూ.41వేలకు పైగా నగదు ఆయనకు తెలియకుండానే సైబర్ నేరగాళ్లు అపహరించారు. ఈ నెల 18, 19 తేదీల్లో రూ.23 వేలు, 20వ తేదీన రూ.8,900, 22న రూ.10వేలు మాయమయ్యాయి. ఆదివారం రాత్రి ఈ విషయాన్ని గుర్తించిన ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

పెనుకొండ: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు మూడు నెలల పాటు ఉపాధి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు పెనుకొండలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కళాశాలలోని స్కిల్ హబ్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణ ఉంటుంది. ఇంటర్, డిగ్రీ, ఆపై చదివిన యువతీయువకులు అర్హులు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 29వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 96767 06976లో సంప్రదించవచ్చు.

అ'పూర్వ' కలయిక



రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నార్పల: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారు అదే పాఠశాల వేదికగా ఆదివారం సందడి చేశారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారందరూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను ఘనంగా సన్మానించారు.



నంది విగ్రహం వద్ద పర్యాటకుల సందడి



ఏడు శిరస్సుల నాగేంద్రుడి విగ్రహం వద్ద ఫొటోలు తీసుకుంటున్న దృశ్యం



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



వేలాడే స్తంభం కింద నుంచి దుప్పట్టా లాగి పరిశీలిస్తున్న యువత

లేపాక్షిలో పర్యాటక సందడి

లేపాక్షి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గాష్టమిని పురస్కరించుకుని లేపాక్షి ఆలయం పర్యాటకులతో కిక్కిరిసింది. దుర్గామాత దర్శనం కోసం భక్తులు, పర్యాటకులు బారులు తీరారు.నాట్యమంటపం, కల్యాణ మంటపం, ఏడుశిరస్సుల నాగేంద్రుడి విగ్రహం, లతా మంటపం, నంది విగ్రహం, థీం పార్కు తదితర ప్రాంతాల్లో సందడి నెలకొంది.

మహో కనకదుర్గా..శివానంద రూప!


పాతూరు అమ్మవారిశాలలో మహిషాసుర మర్దిని


రాప్తాడులో పూజలందుకుంటున్న పార్వతీదేవి


రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లిలో పూజలందుకుంటున్న ఉజ్జినేశ్వరుడు


కొత్తూరు అమ్మవారిశాలలో మహిషాసుర మర్దిని, వాసవీదేవి, అష్టలక్ష్మి అలంకరణ


బ్రహ్మంగారి ఆలయంలో కనకదుర్గగా అమ్మవారు


అలంకరణలో రేణుక యల్లమ్మ


బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో చిన్నారుల దేవతావేషధారణలు


మున్సిపల్ కాంప్లెక్స్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు

అనంతపురం కల్చరల్: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాలు లలితా సహస్రనామాలతో పులకించిపోయాయి. ఆదివారం రాత్రి మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, రెండోరోడ్డులోని చంద్రశేఖరేంద్ర సరస్వతీ జ్ఞాన పీఠం, పాతూరు బ్రహ్మంగారి గుడి తదితర చోట్ల అమ్మవారు కనకదుర్గగా, మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. పాతూరులో బ్రహ్మకుమారీల ఇన్‌చార్జ్ సిస్టర్ శారద ఆధ్వర్యంలో చిన్నారులు వివిధ దేవతా రూపాల్లో ఆకట్టుకున్నారు. శివబాలయోగి ఆశ్రమంలో చిన్నపిల్లలకు కుమారి పూజలు నిర్వహించారు. శారదాశంకర మఠం, మొదటిరోడ్డులోని చౌడేశ్వరి అమ్మవారు, శివకోటి, కొత్తూరు, పాతూరు వాసవీ ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం రూరల్: స్థానిక శిల్పారామంలో దసరా పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆర్య ఆది డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పారామం ఏవో కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: మండలంలోని నవరాత్రి ఉత్సవాలు ఉపందుకున్నాయి. రాప్తాడులో పెద్దమ్మ, మారెమ్మ, పార్వతి, మరిగమ్మ, గంగలకుంటలో దుర్గమ్మ, సంగాలప్ప, బుక్కచెర్లలో నల్లలమ్మ, హంపాపురంలో గంగమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. బొమ్మేపర్తి (జయలక్ష్మిపురం)లోని గణపతి సచ్చిదానంద (జయలక్ష్మిమాత) ఆశ్రమంలో మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ తల్లి జయలక్ష్మిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

ఆత్మకూరు: ఆత్మకూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతకు ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. వడ్డుపల్లి గ్రామంలో సుంకులమ్మ అమ్మవారికి, పొలిమేర పెద్దమ్మతల్లికు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఆయుధ పూజ : మండల వ్యాప్తంగా ఆయుధ పూజ చేశారు. వాహనాలు ఉన్నవారు తమ వాహనాలను అలంకరించి, పూజలు నిర్వహించారు.


అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు


పాతూరు అమ్మవారిశాలలో మహిషాసుర మర్దిని అలంకరణ


రాప్తాడు మండలం గంగలకుంటలో పూజలందుకున్న సంగాలప్ప

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆయుధ పూజ


రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ

రాప్తాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆయుధ పూజనుభక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు, ఎద్దుల బండ్లకు పూజలు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ఆయుధాలకు పూజలు చేశారు. ఉదయం నుంచే ప్రజలు తాము నిత్యం ఉపయోగించే పనిముట్లు, వాహనాలు, యంత్రాలకు పూజలు చేశారు. ఎస్‌ఐ పీవై ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోండి

అనంతపురం కార్పొరేషన్: పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ సిబ్బందిని ఇన్‌చార్జ్ కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. ఆదివారం నగరంలోని రాంనగర్, పాతూరు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పండుగ వేళల్లో అప్రమత్తంగా ఉండి, ఎప్పటికప్పుడు చెత్త కంపోస్టు యార్డుకు తరలించేలా చూడాలన్నారు. నిర్లక్ష్యం కన్పించకూడదన్నారు.

సర్పరూపుడికి పంచామృతాభిషేకాలు



ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి మూల విరాట్‌కు పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, పూజలు చేశారు. ఆలయంలోని మంజునాథ, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు.

పీఎల్ శ్రీనివాసరెడ్డి సేవలు చిరస్మరణీయం

అనంతపురం: ప్రొఫెసర్ పీఎల్ శ్రీనివాసరెడ్డి సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. పీఎల్ శ్రీనివాసరెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని విద్యార్థులు, సాహితీవేత్తలు, పరిశోధన విద్యార్థులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సమీపంలో ఉన్న ఆయన సమాధికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన నిర్వహించిన సమావేశంలో పీఎల్ శ్రీనివాసరెడ్డి సాహిత్య సేవ గురించి డాక్టర్ పి. దామోదర్ రెడ్డి, అప్పిరెడ్డి హరినాథ రెడ్డి, గంగిరెడ్డి, శివారెడ్డి, బి.వెంకటేశులు వక్తలు ప్రసంగించారు.

అష్ఫాఖుల్లాఖాన్ బాటలో నడవాలి


అష్ఫాఖుల్లా ఖాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆవాజ్ కమిటీ సభ్యులు

అనంతపురం అర్బన్: చిన్నవయస్సులోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, బ్రిటీష్ వాళ్లతో పోరాడిన వీర కిశోరం అష్ఫాఖుల్లా బాటలో నడవాలని ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి ముస్కిన్ అన్నారు. ఆదివారం స్థానిక టీఎస్ఆర్ కాలనీలో అష్ఫాఖుల్లాఖాన్ 128వ జయంతి వేడుకలను ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి, నివాళులర్పించారు. ముస్కిన్ మాట్లాడుతూ దేశంలో మతసామరస్యానికి పాటుపడిన మహోన్నత వ్యక్తి అష్ఫాఖుల్లాఖాన్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఇర్ఫాన్, వలి, ఇస్మాయిల్, బాబ్జాన్, షరీఫ్, ఇలిషాద్, మంజు, తదితరులు పాల్గొన్నారు.

అండర్-23 క్రికెట్ టోర్నీ జట్టుకు అభినందన


బౌలింగ్ వేస్తున్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్

అనంతపురం: అండర్-23 జట్టు సభ్యులను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ అభినందించారు. బీసీసీఐ తరఫున అండర్-23 పురుషుల క్రికెట్ టోర్నీ చండీఘర్‌లో ఈ నెల 28 నుంచి నవంబర్ 12 వరకు జరగనుంది. ఇందులో ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ జట్టు ఈ నెల 15 నుంచి 27 వరకు ఆర్డీటీ స్టేడియంలో ప్రత్యేక క్యాంప్ నిర్వహిస్తోంది. ఈ జట్టుకు కోచ్‌గా కదిరికి చెందిన మాజీ రంజీ క్రికెటర్ షాబుద్దీన్ వ్యవహరిస్తున్నారు.

- ఆర్డీటీ స్టాఫ్ మెన్ క్రికెట్ టోర్నీలో భాగంగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరిగింది. అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో జరుగుతున్న ఈ టోర్నీలో ఆర్డీటీ స్పోర్ట్స్ టీం, కళ్యాణదుర్గం రీజియన్, ఫైనాన్స్ సెక్టార్, శ్రీశైలం జట్లు పాల్గొన్నాయి. ఆర్డీటీ స్పోర్ట్స్ టీం, కళ్యాణదుర్గం, అకౌంట్స్ సెక్షన్, శ్రీశైలం జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి.
- ఆర్డీటీ స్టాఫ్ మెన్ క్రికెట్ టోర్నీలో భాగంగా ట్రాన్స్‌పోర్ట్ టీం- అకౌంట్స్ సెక్షన్ టీంలు పోటీ పడగా మాంఛో ఫెర్రర్ ట్రాన్స్‌పోర్ట్ టీం తరఫున ఆడారు. మొత్తం 20 ఓవర్లకు గాను ట్రాన్స్‌పోర్ట్ టీం నాలుగు వికెట్ల నష్టానికి 168 పరుగులు చేయగా, అకౌంట్స్ సెక్షన్ టీం 19 ఓవర్లలోనే 169 పరుగులు చేసి విజయం సాధించింది. మాంఛో ఫెర్రర్ 23 బంతుల్లో 22 (మూడు ఫోర్లు) పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. ఒక వికెట్ తీశారు. ఆల్‌రౌండర్ ప్రదర్శన చేసినప్పటికీ జట్టు ఓటమి పాలైంది.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


మాట్లాడుతున్న నగర డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. అమిటీ క్రికెట్ క్లబ్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ బహుమతులు, నగదు ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా ఉత్సాహంగా టోర్నమెంట్‌లో పాల్గొన్న జట్టు సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో అమిటీ క్రికెట్ జట్టు-2 పై క్రిక్ లవర్స్-1 జట్టు 8 పరుగుల తేడాతో గెలుపొంది, విజేతగా నిలిచింది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా అమిటీ క్రికెట్ జట్టు -2 ఆటగాడు హరి, సెమీ ఫైనల్ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా బాబ్ జాన్, ఫైనల్ మ్యాచ్‌లో మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ శేషులకు బహుమతులు ప్రదానం చేశారు. క్రికెట్ క్లబ్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆలమూరు శివా రెడ్డి, సెక్రటరీ మారుతీప్రసాద్, జాయింట్ సెక్రటరీ అగిలే జనార్ధన రెడ్డి, వైస్ చైర్మన్ మేక ప్రతాప్, ట్రెజరర్ కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై విహరించిన శ్రీవారు

అనంతపురం కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అశ్వవాహనంపై శ్రీవారు విహరించారు. ఆదివారం స్థానిక ఆర్ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారు శ్రీదేవి, భూదేవి సమేతుడై అశ్వ వాహనంపై ఆలయ పరిసరాల్లో విహరించారు. ఉదయం లక్ష్మీ నారాయణ హోమం, దీక్షా హోమం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా సాగాయి. తీర్థప్రసాద వినియోగం చేశారు. అనంతరం ప్రధాన అర్చకులు, కమిటీ సభ్యులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం రథోత్సవం జరుగుతుందన్నారు. మంగళవారం చక్రస్నానం, ధ్వజారోహనంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. హౌసింగు బోర్డు, శ్రీనివాసనగర్, రామనగర్‌లలో బ్రహ్మోత్సవ సంబరాలు ముగింపుదశకు చేరుకున్నాయి.

రోడ్డు ప్రమాదంపై హోం మంత్రి ఆరా


వాహనం ఆపి ప్రమాదంపై ఆరా తీస్తున్న హోంమంత్రి తానేటి వనిత

రాప్తాడురూరల్: చెన్నేకొత్తపల్లి మండలం కోన కన్వాశ్రమం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంపై అటుగా వెళ్తున్న హోంమంత్రి తానేటి వనిత ఆరా తీశారు. బెంగళూరు నుంచి అనంతపురం వస్తున్న హోంమంత్రి .. కోన కన్వాశ్రమం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గమనించి, కాన్వాయ్ ఆపించారు. ప్రమాద ఘటనపై పోలీసు అధికారులతో మాట్లాడారు. గాయపడిన వ్యక్తిని పోలీసు వాహనంలోనే ఆస్పత్రికి తరలించినట్లు పోలీసు అధికారులు మంత్రికి తెలియజేశారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

సంతల ఆదాయం రూ.4.34 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రికార్డు స్థాయిలో రూ.4.34 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,50,070 వసూలయ్యిందన్నారు. ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,84,400 మేర వసూలు అయినట్లు తెలిపారు.

నిత్యావసరాల వితరణ

అనంతపురం కల్చరల్: దసరా పండుగను పురస్కరించుకొని నిత్య సురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర వస్తువులు అందించారు. ఆదివారం స్థానిక పుట్టినిల్లు ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ నిర్మల, పురుషోత్తమ మురళీ, కవీన్‌ఆదిత్య తదితరులు పేద కుటుంబాలకు 21 వస్తువులతో కూడిన నిత్యావసర కిట్లను వితరణ చేశారు.

కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా ఆదిశేషారెడ్డి

రాప్తాడు: కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా లింగనపల్లికి చెందిన మాజీ సర్పంచు మచ్చా ఆదిశేషారెడ్డి ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఆదిశేషా రెడ్డిని రెండోసారి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

నగదు అందజేత

అనంతపురం రూరల్: దసరా సందర్భంగా పంచాయతీ కార్మికులకు వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదిక్ వలి, రుద్రంపేట ఎంపీటీసీ మహబూబ్‌బీ నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ వెంకట్ రాముడు, గృహ సారథులు అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

రాప్తాడురూరల్: కురుకుంట పంచాయతీ రమణ కొట్టాలులోని పెద్దమ్మ ఆలయం వద్ద ఏపీ ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు రమణ, కాలనీవాసులు ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు.

వశికేరప్పకు ప్రత్యేక పూజలు


వశికేరప్పస్వామి మూలవిరాట్

రాప్తాడు: మండలంలోని మరూరులోని వశికేరప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. విజయదశమి బ్రహ్మోత్సవాలు పదిరోజులుగా నిరాటంకంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆలయంలో ఆయుధ పూజను పురస్కరించుకొని కులగురువు శాంతమూర్తి స్వామితో రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, సహస్ర బిల్వార్చన, మహామంగళ హారతి పూజలు చేశారు. సోమవారం స్వామిని వెండి గుర్రంపై ఊరేగించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వశికేరప్ప స్వామి డెవలప్‌మెంట్ ట్రస్ట్ చైర్మన్ బుడగ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఉత్సవాలకు హాజరుకానున్న ప్రముఖులు: వశికేరప్ప స్వామి వెండి గుర్రం విజయదశమి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, హిందూపురం ఎంపీ గోరట్ల మాధవ్, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి హాజరు కానున్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మేయర్ వసీం తెలిపారు. ఆదివారం మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, ఇన్‌చార్జ్ కమిషనర్ రమణారెడ్డి మేయర్ చాంబర్‌లో కార్మిక సంఘం నాయకులతో సమావేశమయ్యారు. కార్మికులు, ఉద్యోగుల ఈఎస్ఐ, మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా, స్కిల్డ్, అన్‌స్కిల్డ్ సిబ్బంది వేతనాల పెంపు, తదితర మొత్తం 12 అంశాలను సమావేశంలో చర్చించారు. సమస్యలు తీర్చకపోతే ఈ నెల 23, 24న మెరుపు సమ్మె చేస్తామని సీఐటీయూ అనుబంధ నగరపాలక సంస్థ కార్మికులు అన్నారు. తమ పరిధిలో ఉన్న వాటిని పరిష్కరిస్తామని, రాష్ట్రస్థాయిలో ఉన్న వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని మేయర్ హామీ ఇచ్చారు. దీంతో కార్మికులతో జరిగిన సమావేశం సఫలమైంది. సమావేశంలో సీఐటీయూ నాయకులు వెంకటనారాయణ, నాగభూషణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.









కనకదుర్గ పండుగ.. మిన్నంటిన కనకాంబర ధర!





పండుగలు వచ్చాయంటే పూల ధరలు అమాంతం పెరిగిపోతాయి. దసరా పండుగ వచ్చిందంటే.. అమ్మవారికి ప్రీతికరమైన పూల ధరలు మిన్నంటుతాయి. దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని అమ్మవారిని ఆలయాల్లోనేకాక, ఇళ్లలోనూ రోజుకో రూపంలో అలంకరించి, పూజలు చేస్తారు. పూజకు పూలు అధికంగా వినియోగిస్తారు. మార్కెట్‌లో రంగు రంగుల్లో ఆకర్షించే బంతిపూలు కిలో రూ.80 దాకా ధర పలికింది. కనకాంబరం పూలు కిలో రూ.1,000కి పైగా ధర పలికాయి. రాప్తాడు మండలంలోని పూలకుంట సమీపంలో బంతిపూలు, చేమంతి పూలు, కనకాంబరం పూలతోటలు సాగు చేశారు. దసరా పండుగ సందర్భంగా పూలకు గిరాకీ ఉండడంతో రైతులు అనంతపురం, బత్తలపల్లి, ఇతర మార్కెట్లకు తరలించి, లాభాలు గడించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:




దసరా పండుగ సందర్భంగా అనంతపురం పాతూరు మార్కెట్‌లో చెండుపూలు విక్రయిస్తున్న వ్యాపారులు

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	232	65,398
నిఫ్టీ ▽	82	19,543

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
నాస్‌డాక్	12,984	▽ 202
డోజోన్స్	33,127	▽ 287
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,402	▽ 97
డాక్స్	14,798	▽ 247
హాంగ్‌సెంగ్	2,983	▽ 22
నికాయ్	31,259	▽ 171

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.43	84.10
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.44	102.75
€	యూరో	ఒకటి	86.54	89.63
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.73	56.44
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.55	53.84
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.70	61.63
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.73	23.53
¥	చైనా యువాన్	పదింటికి	10.24	12.31

పాత బంగారం మార్చుకుంటున్నారా?

పండుగలు అంటే కేవలం ఖర్చు చేయడమే కాదు.. భవిష్యత్తు 'బంగారు'బాట వేసుకోవడం కూడా. నచ్చిన గృహోపకరణాలు, గ్యాడ్జెట్లు కొనే వారు, అందులో కొంత ఆదా చేసి భవిష్యత్ కోసం ఎందుకు ఇన్వెస్ట్ చేసుకోకూడదు? ఇలా ఆలోచించే కొందరు పండుగ సమయాల్లో బంగారం కొనుగోలు చేస్తుంటారు. బంగారం కేవలం అందాన్ని పెంచే ఆభరణం మాత్రమే కాదు, విలువను పెంచే ఆస్తి. అస్థిర తల్లో ర్యాలీ చేసే పెట్టుబడి సాధనం. కనుక పండుగ సమయాల్లో విలువ తరిగిపోయే వాటి కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టేవారు.. పసిడికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నది నిపుణుల సూచన.

- ఆభరణం కోసమా.. పెట్టుబడి కోసమా?
- రెండింటికీ ఒక్కటే విధానం అనుకూలం కాదు
- అవసరమైతేనే కొత్త ఆభరణంతో మార్పిడి
- ఈ సమయంలో తయారీ, పన్నుల రూపంలో నష్టం
- పెట్టుబడి దృష్ట్యా మెరుగైన ప్రత్యామ్నాయాలు



గడిచిన కొన్నేళ్లలో బంగారం కొనుగోలు ఎన్నో మార్పులను సంతరించుకుంది. 20 ఏళ్ల క్రితం బంగారంపై పెట్టుబడి పెట్టే వారు అరుదుగా కనిపించే వారు. తర్వాత కాలంలో ఇందులో స్పష్టమైన మార్పు కనిపించింది. ముఖ్యంగా గడిచిన పదేళ్ల కాలంలో బంగారాన్ని పెట్టుబడి సాధనంగా అర్థం చేసుకోవడం పెరిగింది. గతంలో బంగారంపై పెట్టుబడి అంతా భౌతిక రూపంలోనే ఉండేది. ఇప్పుడు సార్వభౌమ పసిడి బాండ్లు (ఎస్‌జీబీలు), గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్, గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు) సాధనాలు అందుబాటులో ఉన్నాయి. అయినా, ఇప్పటికీ పెట్టుబడి దృష్ట్యా భౌతిక బంగారానికే ఎక్కువ మంది ప్రాధాన్యం ఇస్తున్నారు. ధంతేరస్ (ధనత్రయోదశి) వంటి ప్రత్యేక పర్వదినాల్లో పెద్ద ఎత్తున బంగారం కొనుగోళ్లు నమోదవుతుంటాయి. ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అయ్యే ఆస్తుల్లో బంగారానికి మొదటి స్థానం ఉంటుంది. నేటితరం పాత బంగారాన్ని, కొత్త ఆభరణాలతో మార్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. నిజానికి పాత బంగారం మార్పిడితో కొత్త ఆభరణాలు కొనుగోలు చేయడం సరైనదా..? ఆభరణాలను పెట్టుబడిగా చూడొచ్చా? పెట్టుబడి కోసం ఏ రూపంలో ఇన్వెస్ట్ చేయడం మెరుగు? ఈ విషయంలో నిపుణుల అభిప్రాయాలను ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం.

బంగారం మార్పిడి విధానం..?

పాత బంగారు ఆభరణాలను మార్చుకోవడం వెనుక ఎన్నో కారణాలు ఉండొచ్చు. మార్కెట్లోకి వచ్చే కొత్త డిజైన్ల పట్ల ఆసక్తి ఏర్పడొచ్చు. పాత నగలు డ్యామేజ్ కావొచ్చు. లేదంటే కొత్త ఆభరణాలు కొనుగోలు చేసుకోవడానికి బడ్జెట్ లేక పాత వాటిని మార్చుకోవచ్చు. కారణం ఏదైనా.. పాత బంగారం మార్చుకునే క్రమంలో కొంత నష్టపోతున్నామనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. పాత బంగారం ఆభరణాల మార్పిడికి సంబంధించి మన దేశంలో ప్రామాణిక విధానం అంటూ లేదు. వర్తకుల మధ్య వ్యత్యాసం కనిపిస్తుంది. ఆభరణం కొనుగోలు చేసిన వర్తకుడి వద్దే దాన్ని మార్చుకోవడం వల్ల గరిష్ట విలువను తిరిగి పొందడానికి అవకాశం ఉంటుంది. హాల్‌మార్క్ ఆభరణాలు అయితే బంగారం మార్కెట్ ధర మేర విలువను పొందొచ్చు. అయినా కానీ, ఆభరణాల తరుగు-తయారీ చార్జీలు అధికంగా ఉంటున్నాయి. బంగారం ధరలో 10-20 శాతం వరకు తరుగు, తయారీ చార్జీలను జ్యుయలరీ సంస్థలు వసూలు చేస్తున్నాయి. పాత ఆభరణాన్ని మార్చుకున్నప్పుడు అందులో తరుగు-తయారీ రూపంలో కొంత నష్టం ఏర్పడుతుంది. తిరిగి నూతన ఆభరణం కొనుగోలు చేయడం వల్ల, దాని తరుగు-తయారీ చార్జీల రూపంలో అదనంగా చెల్లించుకోవాల్సి వస్తుంది.

మార్చుకుంటే ఎంత కోల్పోవచ్చు..?

	పాత ఆభరణం	కొత్త ఆభరణం
బరువు	20గ్రాములు	20 గ్రాములు
ధర (10 గ్రా.)	రూ.60,000 (సుమారు)	రూ.60,000
తరుగు-తయారీ చార్జీలు	లేవు	15 శాతం
పన్ను	వర్తించదు	3 శాతం
మొత్తం ధర	1,20,000	1,41,600

మార్చుకోవడం వల్ల కోల్పోయేది రూ.21,600

కొనుగోలు మార్గాలు.. చార్జీలు.. రిస్కులు

సాధనం	కొనుగోలు మార్గం	రిస్క్	చార్జీలు	కనీస పెట్టుబడి
భౌతిక బంగారం	ఆభరణాలు, కాయిన్లు, కడ్డీలు	జాగ్రత్తగా కాపాడుకోవడం	లాకర్, తయారీ, ఇన్సూరెన్స్ వ్యయాలు	ఒక గ్రాము విలువ
డిజిటల్ గోల్డ్	యాప్స్ సాయంతో	నియంత్రణ, పర్యవేక్షణ లేదు	జీఎస్‌టీ పన్ను	రూపాయి నుంచి
గోల్డ్ ఈటీఎఫ్‌లు	షేర్ల మాదిరే, స్టాక్ ఎక్ఛేంజీల నుంచి	ధరల్లో రోజువారీ హెచ్చుతగ్గులు	ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియో, డీమ్యాట్ ఏఎంసీ చార్జీలు, బ్రోకరేజ్	ఒక గ్రాము నుంచి
గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్	ఏఎంసీల నుంచి, బ్రోకర్ల నుంచి	ఈటీఎఫ్‌ల మాదిరే	0.6-1.20 శాతం	రూ.100 నుంచి
ఎస్‌జీబీలు	ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంక్‌లు, బ్రోకర్ల సాయంతో	దాదాపుగా లేనట్టే	చార్జీల్లేవు, పైగా పెట్టుబడి విలువపై ఏటా 2.5 శాతం రాబడి	రూ.5,000 నుంచి

కొనుగోలు చేసిన వర్తకుడి నుంచి కాకుండా, వేరొక చోట పాత ఆభరణాన్ని మార్చుకునేట్టు అయితే ప్రక్రియ వేరుగా ఉంటుంది. వర్తకులు కొందరు కొన్ని అంశాల్లో ఏకరూప విధానాన్ని అనుసరిస్తుంటే, కొన్నింటి విషయాల్లో సొంత ప్రక్రియలను అమలు చేస్తున్నారు. పాత బంగారం ఆభరణాన్ని కరిగించి, స్వచ్ఛత చూసిన తర్వాత, కొత్త ఆభరణంతో మార్చుకోవడానికి చాలా సంస్థలు అనుమతిస్తున్నాయి. ''డిజిటల్ స్కేల్ సాయంతో బంగారం ఆభరణం బరువు చూస్తారు. దీని ఆధారంగా స్వచ్ఛతను బట్టి ధర నిర్ణయిస్తారు. సాధారణంగా అనుసరించే స్వచ్ఛతలు 24 క్యారట్ (99.9 శాతం స్వచ్ఛత), 22 క్యారట్ (91.6 శాతం స్వచ్ఛత), 18 క్యారట్ (75 శాతం స్వచ్ఛత). కొందరు జ్యుయలర్లు స్క్రాచ్ (గీయడం), యాసిడ్ టెస్ట్ ద్వారా బంగారం స్వచ్ఛతను నిర్ధారిస్తుంటారు''అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీస్ హెడ్ హరీశ్.వి తెలిపారు. అన్నింటికంటే ప్రామాణికమైనది హాల్‌మార్క్ స్వచ్ఛత విధానం. భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) హాల్‌మార్క్ సర్టిఫికేషన్ సేవలు అందిస్తోందని, హాల్‌మార్క్ గోల్డ్ స్వచ్ఛత పరంగా విశ్వసనీయమైనదిగా హరీశ్ పేర్కొన్నారు. ఇప్పుడు పెద్ద సంస్థలు అయితే క్యారట్‌ను కొలిచే మెషీన్లను ఉపయోగిస్తున్నాయి. వీటినే గోల్డ్ అనలైజర్ మెషీన్లు అంటున్నారు. అందులో బంగారం లేదా ఆభరణాన్ని ఉంచితే బరువు ఎంత, ప్యూరిటీ ఎంత అనే వివరాలను ప్రదర్శిస్తాయి. ఉదాహరణకు వడోదరకు చెందిన రీనా దంపతులు ఎదుర్కొన్న అనుభవాన్ని తెలుసుకుంటే పాత బంగారం మార్పిడి ఇప్పుడు ఎంత సులభంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. వీరివద్దనున్న 20 గ్రాముల బంగారం చైన్ తెగిపోగా, 2014లో మార్చుకుందామని అనుకున్నారు. ఓ జ్యుయలర్ వద్దకు వెళితే, కంటితో చూసి 18 క్యారట్ల బంగారం అని ఖరారు చేసి, రూ.37,500 ధర చెల్లిస్తానని చెప్పాడు. అప్పుడు 10 గ్రాముల బంగారం ధర రూ.25,000 స్థాయిలో ఉంది. దీంతో వారు మార్చుకోలేదు. ఇటీవలే అదే చైన్‌ను ఓ వర్తకుడి వద్దకు తీసుకెళ్లగా, గోల్డ్ అనలైజర్ మెషీన్‌లో పెట్టి చూశారు. 22 క్యారెట్ల ప్యూరిటీ ఉన్నట్టు చూపించింది. దాన్ని కరిగించిన తర్వాత అసలు విలువ చెబుతానని అనడంతో, అందుకు రీనా దంపతులు ఒప్పుకున్నారు. కరిగించిన తర్వాత కూడా 22.1 క్యారెట్ నిర్ధారణ అయింది. దాంతో 10 గ్రాములకు రూ.61,000 చొప్పున విలువ కట్టారు. కొత్త ఆభరణం ధర కూడా అదే రీతిలో ఉండడంతో వారు మార్చుకునేందుకు సమ్మతించారు.

కొత్త ఆభరణాల కొనుగోలు

బంగారం కూడా ఒక ఆస్తే. ఎవరి పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోకైనా ఇది విలువను పెంచుతుంది. ఆభరణం కోసం కొంటున్నారా? లేక పెట్టుబడి దృష్ట్యా కొంటున్నారా? అన్న స్పష్టత అవసరం. భౌతిక బంగారం, ఆభరణాల రూపంలో ఇన్వెస్ట్ చేసుకునేట్టు అయితే తరుగు-తయారీ చార్జీలు, దానిపై జీఎస్‌టీ చార్జీలు చెల్లించాల్సి వస్తుంది. స్వచ్ఛతకు సంబంధించిన సమస్యలు కూడా ఉంటాయి. నేడు చాలా జ్యుయలరీ సంస్థలు తమ వద్దే విక్రయిస్తే 100 శాతం విలువను చెల్లిస్తున్నాయి. ఒక వేళ ఆభరణంతో మార్చుకోకుండా, నగదు కోరితే మొత్తం విలువలో 5 శాతం వరకు తగ్గించి ఇస్తున్నాయి. పన్ను కోణంలో ఇలా చేస్తున్నాయి. ''జ్యుయలరీ అనేది సెంటిమెంటల్. మనోభావాలతో ఉంటుంది. ఒక తరం నుంచి ఇంకో తరానికి బదిలీ అవుతుంటుంది. అయితే అధిక తరుగు-తయారీ చార్జీల (10-20 శాతం)తో మార్చుకునేందుకు అయ్యే వ్యయం ఎక్కువ. దీనికితోడు జ్యుయలరీ కోసం స్టోరేజ్, లాకర్ చార్జీలను కూడా చెల్లించుకోవాల్సి రావచ్చు. భౌతిక బంగారం అయినా, ఆభరణాలు అయినా అవి వ్యక్తిగత ఆస్తులు. ఒక ఇన్వెస్టర్ పెట్టుబడుల విలువకు తోడు కావు. పెట్టుబడి కోసం అయితే బంగారం కడ్డీలు లేదా కాయిన్లను కొనుగోలు చేయడం కాస్త మెరుగైనది'' అని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ దిల్షద్ బిల్లిమోరియా సూచించారు. అయితే బంగారం కాయిన్లు, కడ్డీలను తిరిగి విక్రయించే సమయంలో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె అంటున్నారు. ''బ్యాంక్‌లు కాయిన్లు, కడ్డీలను విక్రయించడమే కానీ, వెనక్కి తీసుకోవడం లేదు. దీంతో వీటిని బయట విక్రయించుకోవాల్సి వస్తుంది. తరుగు, కరిగించేందుకు చార్జీలను ఆ సమయంలో వసూలు చేస్తున్నారు''అని బిల్లిమోరియా వివరించారు.

ఏమిటి మార్గం..?

ద్రవ్యోల్బణం ప్రభావాన్ని కాచుకునే చక్కని హెడ్జింగ్ సాధనం బంగారం అని నిపుణులు చెబుతున్నారు. బంగారంలో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఎవరి పోర్ట్‌ఫోలియోలో అయినా వైవిధ్యం ఏర్పడుతుందని అంటున్నారు. కాకపోతే పెట్టుబడి దృష్ట్యా అయితే ఆభరణాల కంటే మెరుగైన ప్రత్యామ్నాయాలను పరిశీలించాలన్నది నిపుణుల సూచన. గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఎస్‌జీబీలు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్‌ను ఇందుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. ''చారిత్రకంగా చూస్తే బంగారం ధరలు ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా సగటున ఏటా 5-11% మధ్య వృద్ధి చెందాయి. ద్రవ్యోల్బణం పెరిగే సమయంలో గోల్డ్ చక్కని హెడ్జింగ్ సాధనం. పెట్టుబడుల వైవిధ్యం దృష్ట్యా బంగారం ఒక మంచి పెట్టుబడి సాధనం అవుతుంది. అయితే అది కడ్డీలు లేదా జ్యుయలరీ రూపంలో ఉండకూడదు'' అని బిల్లిమోరీ సూచించారు. పీపీఎఫ్, కార్పొరేట్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు వంటి సాధనాలు బంగారం మాదిరే వైవిధ్యానికి తోడు, మెరుగైన రాబడి, లిక్విడిటీతో ఉంటాయని చెప్పారు. కనుక పాత బంగారం మార్పిడి అనేది అవసరం ఆధారంగానే నిర్ణయించుకోవాలి. ఉపయోగించని ఆభరణాలను మార్చుకుని కొత్తవి తీసుకోవడం మంచి నిర్ణయం అవుతుంది. పెట్టుబడి కోసం అయితే ఆభరణాలకు బదులు నిపుణులు సూచించిన ప్రత్యామ్నాయాలను పరిశీలించడం మేలు. దీని వల్ల బంగారం విలువలో నష్టపోయే అవకాశం ఉండదు. 2010 వరకు బంగారం విలువ 10 గ్రాములు రూ.15,000 స్థాయిలోనే ఉండేది. కనుక పెట్టుబడుల దృష్ట్యా భౌతిక బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే వారు. కానీ, నేడు ధర గణనీయంగా పెరిగిపోవడంతో, పెట్టుబడి కోణంలో డిజిటల్ బంగారం సాధనాలకు ప్రాధాన్యం పెరుగుతోంది.



కొటక్ బ్యాంక్ లాభం అప్

క్యూ2లో రూ. 4,423 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కొటక్ మహీంద్రా బ్యాంక్ ఈ ఏడాది (2023-24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 24% జంప్‌చేసి రూ. 4,423 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. స్టాండెలోన్ లాభం సైతం రూ. 2,581 కోట్ల నుంచి రూ. 3,191 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 21% వృద్ధితో రూ. 6,297 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 5.22 శాతాన్ని తాకాయి. ఇతర ఆదాయం రూ. 1,832 కోట్ల నుంచి రూ. 2,314 కోట్లకు పుంజుకుంది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.08% నుంచి రూ. 1.72%కి తగ్గాయి.

అశోక్ వాశ్వానికి సై: కొటక్ మహీంద్రా బ్యాంక్ కొత్త ఎండీ, సీఈవోగా బయటి వ్యక్తి అశోక్ వాస్వాని ఎంపికకు ఆర్‌బీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కొటక్ నాలుగు నెలల ముందుగానే ఎండీ, సీఈవో బాధ్యతల నుంచి వైదొలగుతున్న నేపథ్యంలో అశోక్‌ను బ్యాంక్ బోర్డు ప్రతిపాదించింది.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం జూమ్

క్యూ2లో రూ. 10,896 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 36% జంప్‌చేసి రూ. 10,896 కోట్లను తాకింది. ప్రొవిజన్లు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. స్టాండెలోన్ లాభం సైతం రూ.7,558 కోట్ల నుంచి రూ. 10,261 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ. 31,088 కోట్ల నుంచి రూ. 40,697 కోట్లకు దూసుకెళ్లింది. నికర వడ్డీ ఆదాయం 24 శాతం వృద్ధితో రూ. 18,308 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 4.31 శాతం నుంచి 4.53 శాతానికి బలపడ్డాయి. ట్రెజరీ మినహా వడ్డీయేతర ఆదాయం 14 శాతం అధికమై రూ. 5,861 కోట్లయ్యింది.

ఎన్‌పీఏలు డౌన్...

తాజా సమీక్షా కాలంలో ఐసీఐసీఐ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.19 శాతం నుంచి రూ. 2.48 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 16.07 శాతంగా నమోదైంది.

రామ్‌కో సిమెంట్స్ | షేర్‌ఖాన్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 991 టార్గెట్: రూ. 1,130

ఎందుకంటే: ప్రయివేట్ రంగ కంపెనీ రామ్‌కో సిమెంట్స్ దక్షిణాదిలో సగటు సిమెంట్ ధరల వేగవంత పెరుగుదల, ఈ ఏడాది(2023-24) రెండో త్రైమాసికం (క్యూ2) తదుపరి ఇంధన వ్యయాలు తగ్గడం వంటి అంశాల కారణంగా లబ్ధి పొందే అవకాశముంది. దక్షిణాదిలో సగటు సిమెంట్ ధరలు అక్టోబర్ 5 నుంచి ఒక్కో బ్యాగుకి సుమారు రూ. 40 చొప్పున ఎగశాయి. వెరసి క్యూ2(జులై-సెప్టెంబర్)తో పోలిస్తే సిమెంట్ ధరలు 10 శాతం అధికంగా లభించనున్నాయి. సీజనల్‌గా ఈ ఆర్థిక సంవత్సరం క్యూ2 బలహీన కాలం అయినప్పటికీ బలమైన డిమాండ్ కనిపించింది. ఈ ట్రెండ్ పూర్తి ఏడాదిలోనూ కొనసాగే అంచనాలున్నాయి. పూర్తి ఏడాదికి సిమెంట్ అమ్మకాల పరిమాణంలో 20 శాతం వార్షిక వృద్ధిని కంపెనీ అంచనా వేస్తోంది. ఈ నెలలో అంతర్జాతీయ కోల్, దేశీ పెట్ కోక్ ధరలు నెలవారీగా చూస్తే 13-5 శాతం చొప్పున క్షీణించాయి. మరోవైపు ప్రాంతాలవారీగా సిమెంట్ ధరలు బలపడటంతో నిర్వహణ లాభాలు మరింత పుంజుకునేందుకు వీలుంది. నాన్‌ట్రేడ్ విభాగంపై కంపెనీ ప్రత్యేక దృష్టి సారించడం, అధిక ధరల ఉత్పత్తులు(ప్రీమియమైజేషన్), వ్యయ నిర్వహణా సామర్థ్యాలు, సిమెంటు విక్రయాలలో గరిష్ట ధరలను పొందడం, కొనసాగుతున్న పటిష్ట డిమాండు వంటి అంశాలు కంపెనీ నిర్వహణ లాభం, నికర లా భాలను భారీగా మెరుగుపరిచే అవకాశముంది. దీంతో కంపెనీ ఆర్జనలు పుంజుకోనున్నాయి. ఇది కంపెనీ రీరేటింగ్‌కు దారితీయవచ్చని భావిస్తున్నాం.




పిల్లల ఉన్నత విద్యకు అనుకూల సాధనాలు?

మార్కెట్లలో అస్థిరతలను ఇన్వెస్టర్లు అధిగమించడం ఎలా?

– కిరణ్

అస్థిరతలనేవి ఈక్విటీల సహజ లక్షణం. ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చలిస్తుంటాయి. గడిచిన ఐదు, పదేళ్లుగా మార్కెట్లలో ఇదే ధోరణి కనిపిస్తోంది. ఇన్వెస్టర్లు వీటిని ఎదుర్కోడం ఎలా అన్నది తెలుసుకోవాలి. ఇందుకోసం కొన్ని చర్యలను అమలు చేయాల్సి ఉంటుంది. ముందుగా ప్రతీ ఇన్వెస్టర్ లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను తీసుకుని తమకు, తమ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించుకోవాలి. అత్యవసర సందర్భాల్లో ఈక్విటీ పెట్టుబడులను కదిలించకుండా ఉండాలి. ఇందుకోసం ప్రత్యేకంగా అత్యవసర నిధిని (ఈఎఫ్) ఏర్పాటు చేసుకోవాలి. ఈక్విటీల్లో మీ పెట్టుబడులను కనీసం ఐదు నుంచి ఏడేళ్ల పాటు కదపకూడదు. ఈక్విటీ అస్థిరతలను అధిగమించేందుకు ఈ చర్యలు అవసరం. అలాగే, సిప్ వంటి సాధనాల ద్వారా ఇన్వెస్ట్ చేయడం వల్ల మార్కెట్ అస్థిరతల నుంచి ప్రయోజనాన్ని పొందొచ్చు. సిప్ రూపంలో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసే వారికి మార్కెట్లలో కరెక్షన్లు మంచి అవకాశాలను తెస్తాయి. ఎందుకంటే ఆ సమయాల్లో ఎక్కువ ఫండ్ యూనిట్లను తక్కువ ధరకే సమకూర్చుకోవచ్చు. మార్కెట్లు దిద్దుబాటుకు గురైతే చౌకగా కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. కానీ, మీడియాలో వచ్చే గందరగోళ సమాచారం ఇన్వెస్టర్లను నిరాశకు, అయోమయానికి, భయానికి గురి చేస్తుంది. దాంతో వారు ప్రతికూల సమయాల్లో పెట్టుబడులు చేయడానికి వెనుకాడుతుంటారు. పైగా కొందరు అమ్మకాలు కూడా చేస్తుంటారు. ఇదే అతిపెద్ద తప్పు. ఆ సమయంలో తప్పకుండా సిప్‌ను కొనసాగించాలి. వీలైతే సిప్ మొత్తాన్ని పెంచుకోవాలి. దీనివల్ల దీర్ఘకాలంలో మరిన్ని రాబడులు సమకూర్చుకోడానికి వీలుంటుంది.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి వయస్సు పదేళ్ల లోపే ఉంటుంది. వారి ఉన్నత విద్య కోసం ఏకమొత్తంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఇందుకు అనుకూల సాధనాలు ఏవి? – విజయశ్రీ

పిల్లల విద్య కోసం ఏక మొత్తంలో ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?.. చాలా మంది తల్లిదండ్రులు సాధారణంగా ఎదుర్కొనే సందేహం ఇది. ప్రాపర్టీ విక్రయం లేదా బోనస్ లేదా తాతలు తమ మనవళ్లు, మనవరాళ్ల కోసం నగదు బహుమతి ఇచ్చినప్పుడు.. ఆ మొత్తాన్ని పిల్లల భవిష్యత్తు కోసం ఇన్వెస్ట్ చేయాలని చాలా మంది తల్లిదండ్రులు భావిస్తారు. ఇందుకోసం పలు మార్గాలు ఉన్నాయి. సాధారణంగా ఈ మొత్తాన్ని పిల్లల ఉన్నత విద్య కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే అందుకు, సాధారణంగా పదేళ్ల కాల వ్యవధి ఉంటుంది. అటువంటప్పుడు ఈక్విటీలకు మించి మెరుగైన సాధనం లేదనే చెప్పాలి. ఈక్విటీల్లోనూ ఫ్లెక్సీక్యాప్ విభాగం అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే ఫ్లెక్సీక్యాప్ పథకాలు పెట్టుబడులను వైవిధ్యం ఉండేలా చూస్తాయి. అన్ని రంగాల పరిధిలో, భిన్న మార్కెట్ క్యాప్ కలిగిన (డైవర్సిఫైడ్) కంపెనీల్లో ఫండ్ మేనేజర్ పెట్టుబడులు పెడతారు.

ఒకవేళ పన్ను ప్రయోజనం కూడా కోరుకుంటే ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్‌ఎస్‌ఎస్)ను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి కూడా ఫ్లెక్సీక్యాప్ మాదిరే పనిచేస్తుంటాయి. అన్ని రంగాలకు చెందిన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రిస్క్ తగ్గించే విధంగా ఈఎల్‌ఎస్‌ఎస్ పథకాల పనితీరు ఉంటుంది. ఈ పథకాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయడం ద్వారా సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం పొందొచ్చు. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఐదేళ్ల కాలంలో సగటున 12 శాతానికి పైనే వార్షిక రాబడులు ఇచ్చాయి. ఈ రాబడి రేటు ప్రకారం ఎవరైనా రూ.లక్షను పదేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేస్తే.. రూ.3.14 లక్షలు సమకూరుతుంది. ఈక్విటీల్లో అస్థిరతలు సహజంగా ఉంటాయి. కనుక ఫ్లెక్సీక్యాప్ పథకాల్లోనూ ఇదే కనిపిస్తుంది. అందుకనే ఈక్విటీల్లో ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కాకుండా, తమ దగ్గరున్న పెట్టుబడులను కొన్ని విడతలుగా ఇన్వెస్ట్ చేసుకోవాలి. మీ దగ్గర ఉన్న ఏక మొత్తాన్ని ఏదైనా డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి.. దాని నుంచి ప్రతి నెలా సిస్టమ్యాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) రూపంలో ఈక్విటీ పథకాల్లోకి మళ్లించుకోవాలి. మూడేళ్ల కాలంలో దీన్ని పూర్తి చేయాలి. దీనివల్ల మార్కెట్ల ర్యాలీ, కరెక్షన్లలోనూ ఇన్వెస్ట్ చేసినట్టు అవుతుంది.

హిందాల్కో | మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 473 టార్గెట్: రూ. 570

ఎందుకంటే: అల్యూమినియం తయారీ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్‌కు ఒడిషాలోని హీరాకుడ్, ఆదిత్య ప్లాంట్లను ఇటీవలే సందర్శించాం. తద్వారా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ మెటల్ తయారీ విధానాలు, కార్యకలాపాలను పరిశీలించాం. ఆదిత్య స్మెల్టర్ ప్లాంటు ప్రపంచంలోనే చౌక వ్యయాల, అత్యంత సమర్థవంతమైన యూనిట్లలో ఒకటిగా నిలుస్తోంది. అత్యంత ఆటోమేటెడ్ విధానంలో ఏర్పాటైన ఈ యూనిట్ కార్యకలాపాల నియంత్రణలో అతిఎక్కువ టెక్నాలజీతోపాటు, క్రేన్లు తదితరాలను వినియోగిస్తోంది. డౌన్‌స్ట్రీమ్‌లో ముడిసరుకులకు సంబంధించి ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలిమర్స్(ఎఫ్ఆర్‌పీ) విస్తరణపై ప్రత్యేక దృష్టిని సారిస్తోంది. తద్వారా లాభదాయకతను మరింత మెరుగుపరచుకునేందుకు వీలుంటుంది. ఇది వ్యయాల ప్రభావిత(ఆదా) సమీకృత విధానంలో భాగంకాగా.. సొంత హాట్ మిల్ సామర్థ్యం ద్వారానే ఎఫ్ఆర్‌పీ ప్రొడక్టులను రూపొందించుకోగలుగుతోంది. అత్యున్నత ఆటోమేషన్, టెక్నాలజీ వినియోగంతోపాటు.. తయారీ విధానంలో ప్రతీ చోటా వ్యయాల ఆదాకు మరింతగా ప్రయత్నిస్తోంది. తయారీలో అత్యంత రక్షణాత్మక చర్యలను అనుసరిస్తోంది. సామర్థ్యాన్ని గరిష్ఠంగా వినియోగించుకునే బాటలో సిమ్యులేషన్ ఆధారిత శిక్షణా విధానాలను అవలంబిస్తోంది. పటిష్ట బ్యాలన్స్‌షీట్ కలిగిన కంపెనీ అంతర్గత వనరుల ద్వారానే విస్తరణ సంబంధ పెట్టుబడి వ్యయాలను సమకూర్చుకుంటోంది. అత్యంత సమీకృత కార్యకలాపాలు కలిగిన కంపెనీ డౌన్‌స్ట్రీమ్ సామర్థ్య విస్తరణ ద్వారా లాభాలను భారీగా పెంచుకునే ప్రణాళికలు అమలు చేస్తోంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే